


**మనస్తాపంతో ముఖం బాగా పీక్కుపోయింది మురహరికి. ఇది ఒక్క రోజుది కాదు. ఎంతో కాలంగా మనస్సులో పేరుకు పోయి ఈ నాటికి భరించలేని స్థితికి చేరు కుంది.**

"ఎక్కడో, ఏదో పొరపాటు జరిగింది. లోపం తనలోనే ఉందేమో! తన అవగాహనే పొరపాటై ఉండవచ్చు. తను నమ్మిన సిద్ధాంతాలూ, ఆదర్శాలూ, పాటించిన ఆచారాలూ, అలవాట్లూ సరైనవి కావా? అసలు తన నమ్మకమే గాఢమైనది కాదేమో! తన తెలివి తక్కువతనం, చేతకానితనం వల్లనే తనిప్పుడీ స్థితిలో ఉండటం జరిగింది...." ఆలోచనలతో పాటు మురహరీ సాగిపోతున్నాడు. గమ్యం లేదు.

"మురహరీ! అలా ఉన్నావేం? వంట్లో బాగుండలేదా?" రోజూ తనతోపాటు వాకింగ్‌కి వచ్చే మూర్తి పలకరింపుతో ఈ లోకం లోకి వచ్చాడు మురహరి.

"బాగానే ఉంది. ఆఫీసులో కొంచెం పని వత్తిడిగా ఉంది. అంతే!" అంటుండగా లైట్లు వెలిగాయి. ప్రకాశం బారేజి పేరుకి తగ్గట్టు ధగధగా వెలిగిపోతోంది. దాని వంక చూస్తూ ప్రకాశం గారిని తలుచుకున్నాడు. ఎప్పుడు

తనకి గుండెలు జారినా, దిగులు కలిగినా, తనకి ప్రేరణనీ, స్ఫూర్తినీ కలిగించే కృష్ణవేణికి వజ్రాల మొలనూలులాంటి ఈ బారేజీ, ఆ పేరుకి కారణమైన, గుండెలు తీసిన బంట్రైన ప్రకాశం పంతులూ, ఈ రోజు తన నిరాశను తగ్గించలేకపోయారు. ఎవరితోనూ మాట్లాడా లనిపించకపోవటంతో, మిత్రవర్గం గాంధీ కొండవైపు వెడుతుంటే, మురహరి బారేజీపైన సీతానగరం వైపుకి నడక సాగించాడు.

ఎంత వద్దనుకున్నా, తన అసమర్థతని చాటి చెప్పే సంఘటనలు మనస్సులో మెదులు తున్నాయి. తప్పు తనది కాకపోయినా, తనకి ఓటమి మాత్రమే లభించటం, తెలిసికూడా, అందరూ తనని గేలి చేయటం, మర్చిపోదా మన్నా కుదరటం లేదు. వారి నవ్వులు, హేళ నలు చెవిలో మార్మోగుతున్నాయి. తెలియని పరాయివాళ్ళు అలా చేస్తే సహించవచ్చు. కాని, అన్నీ తెలిసినవాళ్ళూ, తన గురించి బాగా ఎరిగినవాళ్ళూ, ముఖ్యంగా అయిన వాళ్ళూ, తనకీ కావల్సినవాళ్ళూ, తన వాళ్ళూ కూడా తనని చులకన చేస్తుంటే,... అది తన దౌర్భాగ్యమో, చేతకానితనమో! అసలు తన పద్ధతే తప్పేమోననిపిస్తుంది.

మనోహర్ జోషీ పలకరింపుకి ముభావంగా జవాబిచ్చి తప్పించుకోటానికి పని ఉన్నట్లు వేగంగా నడిచాడు. కాని మనసులో ఓ ముల్లు – ముత్యం మెదిలాడు. పేరుకి తగ్గట్టు కడిగిన ముత్యంలా ఉంటాడు చూడటానికి. అంతా పైపై మెరుగే. లోపలంతా బెజవాడలో ఎక్కడపడితే అక్కడ కనబడే మురుక్కాలవలే! ఆ కంపు అనుభవించే తనలాంటి వాళ్ళకి తెలుస్తుంది ఎంత బాధాకరమో! గుర్తురాగానే, అప్రయత్నంగా ముక్కు మూసుకున్నాడు.

మురహరి డిగ్రీ పూర్తికాగానే ఒక గవర్నమెంట్ ఆఫీసులో చిరుద్యోగిగా చేరాడు. అప్పట్లో అందరూ అతడిని చాలా అదృష్టవంతు డన్నారు. మురహరికూడా తను అదృష్టవంతుడ నని మురిసిపోయాడు. నిజాయితీపరుడే కాక, తన పనిని చాలా శ్రద్ధగా చేస్తాడని మంచి పేరుకూడా సంపాదించాడు. జీతం కాక, సంపాదించిందంతే! అంతే....! అందరికీ, చులకనైపోయాడు.

"మా వాడు ఈ కాలంలో పుట్టాల్సినవాడు కాదు. సత్తెకాలపు సత్తెయ్య" తల్లి పక్కింటి పాపాయమ్మగారితో అన్నమాట. అది హేళన కాదు, మెచ్చుకోలే అని సర్దిచెప్పుకున్నాడు.

పాపాయమ్మగారి కొడుకు జీతం చాలా తక్కువైనా, ఉద్యోగంలో చేరిన రెండేళ్ళలో చాలా వెనకేశాడు. ఆ సంగతి ఆవిడ చాలా గర్వంగా చెప్పుకుంటుంది.

"మా మురహరి నిప్పు – ఎవర్రైనా మసి అయిపోతారు. మాకే వాడిని ముట్టుకోవాలంటే భయం – ఎంత కొడుకైనా" – తండ్రి మాటల్లో చివరమాటుండే, 'ఎంత కొడుకైనా' అని. అందులో ఏమన్నా వ్యంగ్యం ఉందా, అని అప్పుడప్పుడూ అనిపిస్తుంది మురహరికి.

"అబ్బో! బావగారి పోస్ట్‌లో నేనుంటేనా! నిన్ను బంగారంలో ముంచెత్తమా?" అని, తన ఎదురుగానే చెల్లెలి భర్త అన్నప్పుడు జోక్‌గా కొట్టిపారేసేవాడు.

"నాకేం తక్కువ? చూడండి! ఇంతకన్నా ఎక్కువ నగలింకేం కావాలి? ఇంతకన్నా ఎక్కువ ఎవరైనా పెట్టుకోగలరా? ఇవన్నీ ఆయన చేయించినవే!" అని తన చేతినిండా వేసుకున్న మట్టిగాజులు, మంగళ సూత్రాలు. దారానికి గుచ్చిన నల్లపూసలు, చూపించి నప్పుడు చారుమతి అల్పసంతోషి అను కున్నాడు.

కానీ....

"గడ్డివాము దగ్గర కుక్క..."

"పానకంలో పుడక....."

"తినడు, తిననియ్యడు...."

ఇటువంటి బిరుదాలిచ్చి సత్కరించినప్పుడు అంటున్నది తననే అని తెలిసినా, పేరు పెట్టి అనలేదు కనక, ఎవరినీ ఏమీ అనటానికి లేక. పిరికివాళ్ళలే అని ఊరుకున్నాడు.

ఇన్నేళ్ళ సర్వీసులో తనకి రావాల్సిన ప్రమోషన్లు తన తర్వాత జాయిన్ అయిన, తన కన్నా సర్వీసులో ఎంతో జూనియర్స్ అయిన వాళ్ళు ఎగరేసుకుని పోతే, అర్థం అయి కాక అయోమయంగా చూస్తూ ఉండిపోయాడు. నిరసనతోనూ, జాలితోనూ తన వంక చూసే చూపులని తప్పించుకోటానికి నేలచూపులు అలవాటు చేసుకున్నాడు. కంటికే కాదు. చెవులకి కూడా మూతలు వెయ్యటం అనే కళని అభ్యాసం చేశాడు. కావాలనుకుంటేనే వినడం (Selective hearing) అలవాటయ్యింది. కాని త్రికరణశుద్ధితో పనిచెయ్యటం మాత్రమే నా విధి అని, ఎంత సర్ది చెప్పుకున్నా పాడు మనసు, అప్పుడప్పుడూ నేనున్నాను అని గుర్తు చేసి, ఏదో చెపుతూనే ఉంటుంది. బయటి నుంచి వచ్చే మాటలకి, చెవులమూతలు అడ్డం పడ్డా. లోపలినుండి మనసు చెప్పే మాటలకి అవి వర్తించవుగా! అలాంటప్పుడే కలుక్కు మంటుంది గుండె. వాటిక్కూడా అలవాటు పడిపోయాడు.

కానీ....

కలుక్కుమన్న గుండెలో ముల్లు గుచ్చాడు ముత్యం. ముల్లు తియ్యక మునుపే గునపంతో గుచ్చాడు రత్నం – అదే పుత్రరత్నం.

ఒక్కొక్క అడుగూ, తనదే, తన గుండెల మీద పడుతున్నట్టే ఉంది మురహరికి.



అందరూ తననే తప్పుపడుతుంటే – అదే నిజమేమోననిపిస్తోంది. లేకపోతే, తనొక్కడూ కరక్టు అనుకుంటే, ఇంతమంది తప్పు కావాల్సి ఉంటుంది. తప్పు తనదే అనుకుంటే, ఇంత మంది తప్పు కావాల్సి ఉంటుంది. తప్పు తనదే అనుకుంటే సమంజసంగా ఉంటుందేమో!

మరి, వారం రోజుల నుండి జరుగుతున్న దేమిటి?... మురహరి మనస్సు మూలిగింది.

జాయింట్ డైరక్టర్ నెలరోజులు సెలవు. నిజానికి అప్పుడు డిప్యూటీ ఛార్జ్ తీసుకోవాలి. కాని, ఢిల్లీలో ఉన్న డైరక్టరేటు నుండి ఎవరినో డిప్యుటేషన్ మీద పంపారు –భగవానట. పైగా, జె.డి. ట్రాన్స్‌ఫర్ కోసమే లీవ్ పెట్టినట్టు అందరూ చెవులు కొరుక్కుంటున్నారు. కొత్త జె.డి. వచ్చిన మర్నాడే ముత్యం ఆయన్ని కలిసి, ఆ సంగతి కన్‌ఫర్మ్ చేశాడు. ఆ మర్నాటి కల్లా ముత్యం కొత్త జె.డి.కి పరమాప్తుడైపోయాడు. తన జూనియర్ తనని లెక్కచేయకుండా అలా దూసుకుపోవటం అది తన చొరవ, సమర్థత, చాకచక్యం అని అతడు విర్రవీగటం అలవాటే మురహరికి. కాని, తన పరిధి దాటి వ్యక్తిగత విషయాల జోలికి వస్తుంటే తట్టుకోవటం అతడి వల్ల కావటం లేదు.

కానీ, నిన్నటి విషయం.... ఎందుకో తట్టుకోలేక పోతున్నాడు.

నిన్న ఉదయం 11 గంటలకి, జె.డి. కాబిన్‌లోంచి బయటికి వస్తూ,

“గురూగారూ! ఫర్నిచర్ రిపెయిర్ విషయం వేలల్లో ఉంది కనక ఊరుకున్నాను. ఇప్పుడు మీరడ్డుపడితే ఊరుకునేది లేదు. అసలే ఇల్లు కట్టడం మొదలుపెట్టాను” అన్నాడు ముత్యం.

ఫర్నిచర్ రిపెయిర్ కోసం కొటేషన్స్, రిపెయిర్, బిల్స్.... అప్పుడు వచ్చిన ఒత్తిడులు, కొరుకుడు పడలేదు కనక పడిన మాటలు, అవమానాలూ – జరిగి సంవత్సరం అయినా, పచ్చిగా ఉన్నాయి. మర్చిపోదామని ఎంత ప్రయత్నించినా, సాధ్యం కావటం లేదు మురహరికి. దానిపై కట్టిన పెచ్చులాగి కెలిగాడు ముత్యం. మురహరి మనస్సు విలవిలలాడింది. ఏం మాట్లాడలేదు.

కొత్త జె.డి.ని వారం రోజుల్లోనే వల్లో వేసుకున్నట్టున్నాడు. ఇప్పుడు ఆయనతో కలిసి, కొత్త పర్చేజస్ విషయంలో తననెంత ఒత్తిడి చేశాడో? మురహరికి ఆ పులినోట్లో తలపెడుతున్న ఫీలింగ్. ఇప్పుడు కొనేవి చిన్నవి కాదు. విస్తరణ, మెరుగుదల (Extension and Upgrading) అనే కార్యక్రమంలో భాగంగా, మొత్తం అన్ని జిల్లాల బ్రాంచీలకి, ఏసీలు, వాటర్ కూలర్లూ, ఫ్రిజ్‌లు, ఎగ్జిక్యూటివ్ చెయిర్స్ అండ్ టేబుల్స్, ఫైలు కాబినెట్స్ లాంటివెన్నో ఖరీదైన వస్తువులు కొనుగోలు చెయ్యాల్సి ఉంది.

సాయంత్రం నాలుగింటికి “గురూ! ఏం నిర్ణయించుకున్నారో, అడగమన్నారు జె.డి.” అన్నాడు ముత్యం.

“ఎప్పట్లాగే కొటేషన్లూ, నాణ్యతలూ....” మురహరి మాటలు పూర్తికానియ్యలేదు ముత్యం.

“ఛ! మీరు మారరు. మార్చక తప్పదు” అంటూ జె.డి. కాబిన్‌లోకి వెళ్ళాడు.

అయిదు నిమిషాల తర్వాత పిలుపొచ్చింది జె.డి నుండి. వెళ్లాడు.

“సీ! మిస్టర్ మురహరీ! యువార్ గోయింగ్ ఆన్ లీవ్ ఫర్ టెన్ డేస్. ప్లీజ్ హాండోవర్ ది ఛార్జ్ టు మిస్టర్ ముత్యం. యు కెన్ గో!” అన్నాడు జె.డి.

అవాక్కయ్యాడు మురహరి.

వెనకాలే వచ్చిన ముత్యం “మీరు మనసు మార్చుకుంటే అక్కర్లేదు లీవు” అన్నాడు.

ఇంక ఒక్క క్షణం ఆఫీసులో ఉండబుద్ధి కాలేదు. ఎప్పుడు లేనిది నాలుగూ పదికే ఆఫీసు వదిలి ఇంటికి వచ్చేశాడు.

(సాయంత్రం రత్నాకర్ కాలేజీ నుంచి ఇంటికి బైక్ మీద వచ్చాడు. ఆ బైక్ ముత్యం కొడుకు సాగర్‌ది. చారుమతి ఇద్దరికీ టిఫిన్ పెట్టి, కాఫీ ఇచ్చింది.)

గుమ్మం ముందు కొత్త బైక్ ఉంది. లోపల్నించి ముత్యం కొడుకు సాగర్ గొంతు వినిపిస్తోంది.

“ఆంటీ! మోపెడ్ అమ్మేసి, డాడీ నా కోసం బైక్ కొన్నారు చూడండి” అన్నాడు సాగర్.

“బాగుందయ్యా! కంగ్రాచ్యులేషన్స్!” అంది చారుమతి మురిపెంగా.

“అమ్మా! సాగర్ చాలా లక్కీఫెలో! వాడికి అంకుల్ అన్నీ కొనిస్తారు” రత్నాకర్ మాటల్లో ఉంది వట్టి మెచ్చుకోలేనా?

“అవును! దేనికైనా పెట్టిపుట్టాలి” అంటూ లోపలికి వెళ్ళింది చారుమతి.

“నిజంరా! మీ డాడీ గ్రేట్”

“మీ డాడీ కేం తక్కువరా! మా డాడీకి పై ఆఫీసర్” సాగర్ అన్నాడు.

## ప్రతిభావంతుడు



‘కొంజుం సలంగై’ తమిళచిత్రం తెలుగులో ‘మురిపించే మువ్వలు’గా డబ్బింగ్ చేశారు. ఈ చిత్రంలో జెమినీగణేశన్, సావిత్రి నటించారు. ఈ చిత్రంలో సావిత్రి పాట పాడగా, జెమినీగణేశన్ నాదస్వరం వాయిస్తాడు. ప్రముఖ సినీగాయని ఎస్.జానకి పాడిన పాట “నీ లీల పాడేదా దేవా” అనే పాట చాలా హిట్ అయింది. ఆ పాటకు నాదస్వరం వాయించిన ప్రఖ్యాత నాదస్వర విద్వాంసుడు స్వర్గీయ కారుకురుచ్చి అరుణాచలంగారు. ఈ చిత్రంలో జెమినీగణేశన్‌కు మంచి పేరు వచ్చింది.

కారుకురుచ్చి అరుణాచలంగారి ఇంటి గృహ ప్రవేశానికి జెమినీగణేశన్, సావిత్రి, శివాజీగణేశన్‌తో పాటు సినీప్రముఖులందరూ హాజరయ్యారు. జెమినీ, శివాజీ యిద్దరూ కలిసి కారుకురుచ్చి అరుణాచలంతోపాటు నాదస్వరం వాయించేటట్టు ఫోటో తీసుకున్నారు. “మురిపించే మువ్వలు” చిత్రం నుండి అరుణాచలంగారితో జెమినీగారి స్నేహం పెరిగింది. అప్పుడప్పుడూ కలుసుకొని మాట్లాడటం, జంటగా భోజనం చేయటం జరుగుతూ ఉండేది. ఆయన చనిపోయేవరకు వారి స్నేహం కొనసాగుతూనే ఉంది.

కారుకురుచ్చి అరుణాచలంగారి నాదస్వరం వినటానికి ఆనాటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వీరిని ఢిల్లీకి రప్పించి వినేవారు. అలాగే రాష్ట్రపతి ఎస్. రాధాకృష్ణన్, కామరాజ్ వంటి ప్రముఖులు వీరి నాదస్వరం విని ఆనందపడేవారు. అభినందనలు తెలిపేవారు.

**– పిళ్ళారిసెట్టి ఆదికేశవరావు**

## పుస్తకాలు

### జయం... జయం (పవిత్ర స్తోత్ర కదంబం)

పురాణపండ శ్రీనివాస్ సంకలనంతో, రమేష్ తిప్పాభట్ల, శశికళ తిప్పాభట్ల (అమెరికా) ప్రచురించిన జయం.. జయం... స్తోత్ర పుస్తకం, ఆధ్యాత్మిక చింతనాపరులకు చాలా ఉపయుక్తంగా వుంది.

ఈ పుస్తకంలో శ్రీ గణేశ పంచరత్నమ్ మొదలు లింగాష్టకం, శ్రీ లక్ష్మీ అష్టోత్తరశత నామ స్తోత్రమ్, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రం, శ్రీ హనుమాన్ చాలీసా వంటి ఎన్నో స్తోత్రాలు వున్నాయి. జ్ఞానమహాయజ్ఞ కేంద్రం, మధురానగర్, హైదరాబాద్-38




వారు దీన్ని ప్రచురించారు. ఈ పుస్తకాలు కావలసిన వారు, జ్ఞానమహాయజ్ఞ కేంద్రం వారికి రాసి పొందవచ్చు. 441 రూపాయలకు నలభై పుస్తకాలు అందజేస్తారు.

"ఆయనో వేస్ట్ కేస్! తను సుఖపడదు, మమ్మల్ని సుఖపెట్టడు" ఒక్క గంట ముందుగా ఇంటికి వచ్చినందుకు సర్‌ప్రైజ్ గిఫ్ట్! గుండెల్లో గునపం!!

"నిన్న ముందు రావటమే కాదు. ఇవాళ ఆఫీసుకి వెళ్ళక పోవటం కూడా. ఇంట్లో అందరికీ ఆశ్చర్యమే! వంట్లో బాగుండలేదని అందరూ ఆందోళన పడ్డారు - కాదని నమ్మించటం కష్టమే అయింది.

"ఆఖరుకి కన్నకొడుకు చేత కూడా, పనికి రాని వాడుగా పరిగణించబడ్డాక, నిజంగానే, తన బతుకు వేస్ట్. తిరిగి వెళ్ళి అందరి తిరస్కారాలూ భరించే కన్నా, ఒక్క క్షణం గుండె దిటవు చేసుకుని, ఒక్క నిమిషం కళ్ళూ ముక్కూ మూసుకుని 'కృష్ణ! కృష్ణ' అంటూ కృష్ణవేణిని శరణుకోరితే - ఆప్యాయంగా కడుపులో పెట్టుకుంటుంది. కాదంటే, సలుగురితోపాటు నారాయణా అని ముత్యం పెట్టమన్న చోట సంతకాలు పెట్టి, కొడుకుతో సహా అందరిచేత మంచి అనిపించుకోవాలి" మురహరి కాసేపటూ, కాసేపిటూ ఊగిసిలాడింది.

ఇంత కాలంగా తాను నమ్మిన నీతి, నిజాయితీ, ధర్మం... వీటికి తిలోదకాలా?.....

కృష్ణా జలాల్లో ప్రాణవాయువులా?...

ఆలోచనల తీవ్రతతో నడకవేగం పెరిగింది. లారీ హారన్‌తో ఈ లోకంలోకి వచ్చి చూశాడు. అప్పటికే బారేజీ దాటి, సీతానగరం వచ్చేశాడు. గిరుక్కున వెనుదిరిగాడు. సీతానగరంలోని ఆశ్రమానికి గాని, గుడికి గాని వెళ్ళాలనిపించలేదు.

"వెడితే ఏం లాభం? కనీసం మనశ్శాంతిని కూడా ఇవ్వలేని భగవంతుడిని దర్శించుకున్నా ఒకటే, లేకపోయినా ఒకటే. అసలా భగవంతుడనే వాడున్నాడా?.... ఉంటే, కనపడేవాడు కదా!... లేదేమో..." అందుకే కనబడడేమో! ఉన్నాడనుకోవడం మనుషుల కల్పన అయి వుంటుంది. ఉన్నాడనుకోవడం బలహీన మనస్కులకో ఆలంబన... అంతే! అట్లాంటప్పుడా గుడిదాకా వెళ్ళటమెందుకు? కాసేపు ఇక్కడే తచ్చాడితే సరిపోతుంది. జన సమ్మర్దం లేనప్పుడు హాయిగా అనుకున్న పని చేసెయ్యొచ్చు. అన్ని రకాల సమస్యల నుంచి, అవమానాలనుంచీ, చీదరింపులు నుంచీ, అణగదొక్కటాలనుంచీ... విముక్తి...."

పక్కనే బైక్ ఆగితే, అదిరిపడి చూశాడు మురహరి.

"నాన్నా! మీ జె.డి. మిమ్మల్ని అర్జంటుగా రమ్మంటున్నారుట. ఇంకా ఆఫీసులోనే ఉన్నారుట. మీ ప్యూన్ చెప్పాడు. అందుకనే సాగర్ బండి తీసుకువచ్చాను" రత్నాకర్ చాలా కంగారుగా చెప్పేశాడు.

తన కార్యక్రమం మర్నాటికి వాయిదా వేసి కొడుకు వెనక బైక్ మీద కూర్చున్నాడు మురహరి. పది నిమిషాల్లో ఆఫీసులో ఉన్నాడు. అందరూ ఉన్నారు. మురహరిని చూస్తూనే జె.డి.

"వెల్‌కం, మిస్టర్ మురహరీ! కంగ్రాట్యులేషన్స్ ఆల్సో. మీ పేరు 'బెస్ట్ ఎంప్లాయీ ఆఫ్ దిస్ ఇయర్"కి నామినేట్ చెయ్యబడింది. శుభవార్తకి తోడొక చిన్న చేదువార్త. మిస్టర్ ముత్యం అరెస్టయ్యారు. రెడ్ హాండెడ్‌గా పట్టుబడ్డారు. నేను మీ డిపార్ట్‌మెంట్ కాదు. ఎసిబి. మీ పాత జె.డి. ముత్యంతో కలిసి చేసే అవినీతి పనులు తెలిసే, లీవ్‌లో వెళ్ళమనటం జరిగింది. ఇక్కడి ఆఫీసు రికార్డ్సు వెరిఫై చేస్తే - మీకు జరిగిన అన్యాయం, ప్రమోషన్ తొక్కిపెట్టబడటం వెలుగులోకి వచ్చాయి. అన్నీ సర్దుబాటు అవుతాయిలెండి. రేపు మీరు యథాప్రకారం ఆఫీసుకి రావచ్చు. సారీ! మామూలు ఆఫీస్. మీ పోస్ట్ మామూలు కాదు. మీరు ఆఫీసర్. సెక్షన్‌హెడ్. వన్‌మోర్ కంగ్రాట్స్!"

జె.డి మాటలనందరూ నోళ్ళు తెరుచుకుని విన్నారు.

"ఈయనకి తెలుగు వచ్చా?"

"ఇందుకా అందరినీ ఇంతసేపూ ఉంచింది?"

"సారీ! మిమ్మల్నందరినీ ఇంతసేపు ఉంచినందుకు ఈ రాత్రికే నేను హైదరాబాదు చేరి, ఉదయం ఢిల్లీ ఫ్లయిట్ అందుకుని, రేపు పదింటికల్లా డైరక్టరేట్‌లో రిపోర్ట్ సబ్మిట్ చేయాలి. మురహరి గారి ఈవినింగ్ వాక్ మిమ్మల్ని డిలే చేసింది. థ్యాంక్యూ ఫర్ యువర్ కోపరేషన్. గుడ్‌లక్!" అంటూ అందరికీ షేక్‌హాండిచ్చి ఆశ్చర్యంలోంచి ఎవరూ తేరుకుని, ఏమీ అనేలోపే వెళ్ళిపోయారు శ్రీ భగవాన్ గారు.

ప్రమోషనూ, . అవార్డూ ఇచ్చినందుకు కాదు, తనకు బతుకు ఇచ్చినందుకూ, తనను బతికించినందుకూ, తన బతుకుకి అర్థం కల్పించినందుకూ, తను నమ్మిన సిద్ధాంతాలని సార్థకం చేసినందుకూ - చేతులు జోడించి హృదయపూర్వకంగా నమస్కరించాడు మురహరి - తనకు మళ్ళీ బతకాలనే ఆశ చిగురింప చేసిన భగవాన్ తనపాలిట సాక్షాత్తూ భగవంతుడే! అని.